# మోసం చేసిందా?

హనుమంతరావు హాస్యం ప్రణయతత్వమూ, ప్రబంధ పారాయణా, విరహ వర్ణనలూ, ప్రేయసీస్మరణలలో ప్రారంభమై, చప్పన వారంరోజుల క్రింద వేదాంత చర్చా, విరక్తి ఉపన్యాసాలూ, సీతారామాంజనేయ పఠనమూ, స్త్రీద్వేషములోకి దిగింది. భర్తృహరి శృంగారశతకం ఆఖరుపేజీతిప్పి, వైరాగ్యశతకం ప్రారంభించినట్లయింది. వాడి వాగుడంతా వినేగతి పట్టిన నేను, పది పదిహేనురోజులు శాంతంగా భరించి, చికిత్సలు ప్రయత్నించాను. కాని యీ జాడ్యపు అసలు కారణం కనిపెడితేగాని స్వస్థత కలగదని, అతను ఆ జాడ్యంలోనూ, అంతకుముందూ చేస్తున్న ప్రదక్షిణాలవల్ల కారణం విశ్వాలయం ప్రాకారసామీప్యంలో వుండాలనుకుని వెతికాను. అతనిని వొదిలిన శృంగారజాడ్యం అక్కడ నన్నావరించింది.

ఈ శరీరం అసహ్యపు మాంసమనిన్నీ, దీన్ని జాగ్రత్తగా అలంకరించడమంత పరిహాసాస్పదమైన పనిలేదనీ, యెన్నడో కట్టెలలో కాల్చేదేననీ పాకుతున్న హనుమంతరావు ఉత్సాహవాక్యాలను వీలైనంతవరకు పెడచెవిని పెట్టి షోకుచేసుకుని, విశ్వాలయంవేపు వెళ్ళాను. సంజమసకలో తెల్లగన్నేరు మొక్కలకిందికి లలిత వొచ్చింది. నాలుగు రోజుల్లో యెవరితోనూ నాకింత స్నేహం కాలేదు. మొదటిరోజునే నాతో—

“నన్నొక్క సందేహం బాధిస్తోంది. మీరు మీ జ్ఞానవిశేషంవల్లా, విద్యాధిక్యతవల్లా తీర్చగలరని నా ఆశ. మీ కీర్తి మీ పుస్తకాలవల్లా, కొందరు స్నేహితులవల్లా, విన్నాను” అంది.

ఆ స్నేహితులలో ఒకడు హనుమంతరావు కాదుగదా! అని సందేహం కలిగి, “అతన్నెరుగుదువా” అని అడిగాను లలితను. చాలా నాజూకుగా తలవంచుకొని, “నాకు బాగా తెలీదు. నా అక్కయ్యనెరుగు నాయన,” అంది. నా గుండె నిబ్బరంపడి, రాత్రికి వాడిగొంతుక పిసకడమా? కత్తితో నరకడమా? యేది సులభమనే ఆలోచనను ఆపుకున్నాను. ముసలిధరను వొదలిరావడమా? యేమిటీమె సందేహమని ఆలోచించాను. కాని ఆమె నా దగ్గిర్నుంచి సందేహంతీర్చుకునేపద్ధతి చాలా మనోహరంగా వుండడంవల్ల

దాన్ని తీర్చడానికి నే నేమీ తొందరపళ్ళేదు. దేవాలయ పుణ్యక్షేత్రంలో, లక్ష్మీదేవి సాన్నిధ్యమందు, తెల్ల గన్నేరువాసనలలో నానిన నూనెప్రమిదలూ వాడిన తులసీదళాలు కలిసిపంచే సుగంధంలో తెలరాత్రి చిన్న చీకట్లలో దొరికిన ఈ శృంగారం నా కెంతో వుల్లాసాన్నీ మాధుర్యాన్నీ యిచ్చింది. ఈ స్నేహానికి పర్యవసానమేమిటి? ఈమె యెవరు? ఎందుకిట్లా వొస్తుందని ఆలోచిస్తే ఆ కల యెక్కడమాయమౌతుందో నని భయంతో ఆనందంతో కళ్ళుమూసుకుని మునిగిపోయినాను. హనుమంతరావు వేదాంత శ్రవణం ప్రారంభించగానే గదిలోనించి పరిగెత్తేవాణ్ణి.

ఆరురోజు లయింది, లలితతో పరిచయం పెదిమలదగ్గరే ఆగింది. ఎందుకు? ఇప్పటికి మేమిటో తెలీదు.

"లలితా! నిన్ను వొదిలి వెళ్ళినా రోజల్లా నువ్వే తలపుకొస్తావు. క్లాసుల్లోవున్నా తటాలున నీ రూపం జ్ఞాపకమొచ్చి పిచ్చెక్కుతుంది. నీ ముఖంపోలిక పుస్తకంలో గీస్తోవుంటే మా లెక్చరర్ చూశాడు. నా హృదయాన్ని లాగేసి, యీ చెరుగులో దాచేసుకున్నావు, నీ హృదయానికి దగ్గరగా! నావల్ల నేర మేమిటో చెప్పు. ఎందు కట్లా కళ్ళు కిందికి వాల్చి, జవాబు చెప్పక హృదయంలో యేదో రహస్యమైన బాధవున్నట్లు తోపిస్తావు? నేను నీవాణ్ణే. నన్నిట్లా తోసేస్తా వెందుకు ?"

నిదానంగా వాల్చివున్న ఆ ముఖంవంక చూశాను. ముక్కుదగ్గరనించీ చంపలమీద పొడుగ్గా కణతలవరకు పరుచుకునివున్న కనువెంట్రుకలని చేత్తో తాకి చెంపమీద మెల్లిగా కొట్టాను.

"నా సందేహమే అది. మిమ్మల్ని ఆ రోజునే అడగా లనుకున్నాను. చూడండి. పాపంకదండీ! పెళ్ళి కానివాళ్ళతో సహవాసం? గానీ, యిట్లా కూచుంటే తప్పేముంది కాని...అసలు భార్యగా వుండడం పాపం కదూ! ఈకాస్త సుఖానికి వెయ్యేళ్ళు నరకంలో అగ్నిగుండంలో కాలడం!"

ఇంతేనా యీ సందేహం అనుకున్నాను. కాని లలిత మనసులో యీ వూహ బాధిస్తున్నట్టూ, యీ ఆలోచనే ఆమెని ఆటంకపరుస్తున్నట్లూ తట్టింది. కాని ఇంత గాఢంగా ఆలోచించడానికి వ్యవధాన మెక్కడిది? వయసులోవున్న పిల్ల తన వాంఛనీ, ధర్మాన్నీ విడదీసి యోచించకలిగినంత

అవసర మెట్లా కలిగిందని ఆశ్చర్యం వేసింది. నేనూ ఆలోచించ కలుచుకో లేదు. "లలితా! నవ్వడం మంచి దయింది. ఈ విషయమై నేను దీర్ఘంగా ఆలోచించాను. నాకంటె ఎవరికీ ఎక్కువ తెలీదు. ఇంకెవరినన్నా అడిగితే నీకు తప్పు అభిప్రాయాలు చెప్పివుందురు."

నోరు సన్నగా చంద్రవంకలాగుచేసి చిరునవ్వుతో, వోరకంటితో నా వంక చూస్తో—"మీ పుస్తకాలు చదివాను. అంతమాత్రం మీ అపారజ్ఞానము, ఉత్తమమేధాశక్తి, కనిపెటలేక పోయినా నంటారా? తరవాత మిమ్మల్ని దారుసార్లు చూసి, మీపుస్తకంలో మీ 'ఫొటో' నించి పోల్చుకున్నాను."

నేను దేవేంద్ర సింహాసనా న్నధిష్ఠించి త్రైలోకాధిపత్యం వెంటనే వహించాను. ఒక స్త్రీహృదయంలో ఇంతవున్న తత్త్వకినీ, ప్రేమనూ వెలిగించిన నా కవిత్వం, నా వంశం, నా జన్మం, నా పద్యాలు అచ్చు వెయ్యమని 'భారతి' ని బతిమాలుకుంటో నేను రాసిన వుత్తరాలు, అన్నీ విఫలమైనాయి.

"నీ మెత్తని మనసులో ఇట్లాంటి దుర్మార్గపుటూహాలు యే రాక్షసులు కల్పించారు?"

"చిన్నప్పటించి మా యింటో పురాణాలు విన్నాను. అప్పటించి నాకీ భయం పటుకుంది. మీ పుస్తకాలు చదివి యెంత ప్రయత్నించినా మనసు కుదటపడ్లేదు."

"స్త్రీ పురుష వాంఛ సహజం. మృగాల్లో పుణ్య పాపాలున్నాయా? మనుష్యుల్లో పాప మని యెవరన్నారు? దేవుడొచ్చి చెప్పాడా? పుస్తకాల్లో రాశారు. ఎవరు? సంఘక్షేమం కోసమని కొందరు మహానుభావు లివి యేర్పరచి, పాపా లని పేరు పెట్టి మూర్ఖుల్ని దడిపించారు. ప్రతివారూ లేచి పోయి సంఘం గోల యిపోతుందేమో నని, యిట్లాంటి నిబంధన లేర్పరిచి, నరకమనే భయంతో మనుష్యుల స్వభావసిద్ధమైన వాంఛల్ని కట్టివెయ్యాలని ప్రయత్నించారు."

"మరి యముడూ, చిత్రగుప్తుడూ వీళ్ళందరూనో?"

"ఆలోచించు. ఆ చిత్రగుప్తుకు నోటుపుస్తకము పట్టుకుని, ఇన్ని కోట్ల ప్రజల గదుల్లోనూ దూరి 'యెలక్ట్రిక్ టార్చి' వెలిగించి, ప్రతి జతకీ వెళ్ళి జరిగిందోలేదో సాక్ష్యాలు విచారించుకుంటో తిరుగుతాడా!"

"నిజం చెప్పదురూ!"

"నిజమే"

"అయితే యింక నీతీ, దేవుడూ యేమీలేవూ!"

"నీకేం? నీతంటే యేమిటి? అంతా మన మేర్పరచుకున్నదే! దేవుడున్నాడు. కాని యీ నీతులన్నీ యేర్పరచింది దేవుడు కాదు..."

ఈ ప్రకారం అరగంట మాట్లాడాను. ప్రతివాక్యం గురు బోధవలె భక్తితో విని వెళ్ళేటప్పుడు నా విద్వత్తును ఒక ముద్దుతో సత్కరించింది.

మర్నాడు నా పుస్తకాలమీద "నా హృదయేశ్వరికి" అని రాసి, ఆమెకి సమర్పించాను. ఆ సాయంత్రమంతా హిందూ మతమువిూదా, ముక్కోటిదేవతలమీదా, త్రిమూర్తులమీదా ఉపన్యాసమిచ్చి, దేవుడు వొక్కడే అనిన్నీ, యీ ప్రపంచం చాలా విశాలమయిం దనిన్నీ, క్షుద్రుల మైన మన చిన్న కార్యాల నీతి అవినీతులు కనిపెట్టడంకన్న యీశ్వరుడికి చాలా పనులున్నాయనీ రూఢీపరిచాను. నీ తనగా మనసులో ప్రేమించిన వాడికి సర్వమూ అర్పించడమేనని బోధించాను. ఆ మాటలకోసమే తనెదురు చూస్తున్నట్లు అతిశ్రద్ధతో వింది.

"పోనీ, యీ పనులకి అంత ప్రాముఖ్యం లేనప్పుడు అనేక మందికి-యిద్దరుముగ్గురికి-సంతోషమిస్తేనేమండి?

నా హృదయం భగ్గుమంది.

"అట్లాకూడదు. ఎవరిని ప్రేమించావో వారినితప్ప యితర్లని తాకడం మహాపాపం."

"పాపం లేదన్నారు."

"అదే, ఆనరకం పాపంకాదు-మన అంతరాత్మలకి..."

"అంటే అంతరాత్మలకైనా, పాపమూపుణ్యమూ వున్నాయన్న మాట."

చర్చ చాలాయిబ్బందిగా దిగింది. చీకటయింది. ఇంకా రేమన్నాళ్ళ? ఈ సౌందర్యం నాపక్కన కూచుని నన్ను దూరాన్నుంచి యేడిపిస్తోంది. ఇంటికి వెళ్ళితే యిట్లా మాట్లాడి, అట్లాచేసి, లోపరుచుకోక మూర్ఖుణ్ణయి కాలమంతా యెందుకు వ్యర్థం చేశానా అని బాధపడి, ఎంతో నిశ్చయపరుచుకుని కొంత ప్రయత్నించినా నన్ను చమత్కారంగా తప్పించుకుంటోంది.

"అదంతా రేపు ఆలోచిద్దాములే, నీమీద ప్రేమతో కాలిపోతో వుంటే, నన్నెందుకింత నిర్దయగా......"

"ఉండండి. మరి ముందు నే చెప్పేమాట వినండి. నిన్నటించి నా మనసులో మీమాటలే ఆలోచిస్తున్నాను. మీరు యెంత బాగా విడదీసి చెప్పారండీ! నాకీ బాధ యెందుకు వచ్చిందంటే . రేపు తెలియచేస్తాను లెండి. రేపే మీ సలహా ఆచరణలో పెడతాను. ఈ యింట్లో నాబతుకు చాలా కష్టంగా వుంది. నా మనసు యెన్నడో ఒక అద్భుతవ్యక్తికి సమర్పితమయింది. (నా వంక అతి నాజూకుగా చూసింది.)

"ఎవరంటారా? మీకే తెలుసు? తెలీకపోతే రేపు చెప్తాను. ఈవేళ పొద్దుపోయింది. మీకు అతను బాగా తెలుసు—మీ అంతరాగాన్నూ.

(నా వొళ్లుప్పొంగింది. చమత్కారం మరిపి!)

"...ఉండండి. .వొదలండి...యీ యింటినుంచి వొచ్చేస్తేనేగాని నా కేమీ తోచదు."

నానుంచితప్పించుకుని మామూలుముద్దన్నా యివ్వకుండా వెళ్ళిపోయింది.

దోవలో ఒకటే ఆలోచన, నా స్వర్గసౌభాగ్యాన్ని గురించి. రేపు సాయంత్రం ఈ అమ్మాయిని యెక్కడికి లేవతీసుకుని వెళ్ళను! ఇన్ని పద్యాలురాసి, యింతబోధించి వెనక్కితగ్గనా? నా చదువేమైతేనేం, ఉద్యోగమేమైతేనేం? ప్రేమయెదట అన్నీ తొలగిపోవలసిందే, ఇటీదగ్గర్నించి నాలుగువొందలు సంపాదించవొచ్చు వారంలో—చెన్నపట్నం వెడితే?

మర్నాడు సాయంత్రం గదిలో షోకుచేసుకుంటూ నుంచున్నా. ఈ హనుమంతరావు రోజల్లా కనపడలేదు. ఏమైనాడో? వాడితో చెప్పనా? వాడి వేదాంతం గోలలో ఈ రసికత్వం ఇనపడుతుందా? దరిద్రుడు యిరవైయేళ్లకే ఆ వేదాంత మేమిటి? పాపం యెంత కర్మంపట్టిందో! వెధవ, వాడి గోలెందుకు? వెళ్ళాలి. కిటికీకింద వుత్తరముంది.

"నా జాతకం తిరిగింది, ఈ తసందేహాలలో నన్ను పొమ్మన్న సుందరి నన్నుతాత్తుగా నీ బోధచేత అంగీకరించింది, ఈవేళ. మా యిద్దరి వందనాలు. ఇద్దరం వెళ్ళిపోతున్నాము. శాశ్వతోటలు శాకీ పైకంలేదు. నువ్వొచ్చెయ్యి.

—హనుమంతరావు"